# 3

"తినవే" ఐస్‌క్రీం కప్పులో, చెంచా వుంచి, అలాగే ఉండిపోయిన "ఇందు" తో అన్నాను."తినవే, ఐస్‌క్రీం కరిగిపోతోందే"

ఇందు కదలలేదు, బదులు పలకలేదు. హోటల్ గదిలో నిగనిగలాడే ఖరీదైన షాండిలెయర్ దీపాలమధ్య కనబడిన ఒకే ఒక జీరోవాల్టు బల్బ్‌లా వుంది, ఇందుమోము.

అతి చల్లటినీళ్ళు నింపి బల్లమీద వుంచిన తెల్లటి గాజుగ్లాసుపైన అక్కడక్కడ మెరిసే నీటి బిందువుల లాంటి కన్నీటి బిందువులు ఇందు చెక్కిళ్ళపై నిలిచివున్నాయి.

"హాస్టల్లో ఇవన్నీ మామూలేనె" ఇందుని స్వాంతనపరుస్తూ అన్నాను, నేను. "మొన్ననేగా హాస్టల్లో చేరావు. నీకు పోను పోను తెలుస్తుందిలే. ఒక్కొక్కప్పుడు డబ్బులు, మంచి డ్రస్సులు కూడా పోతువుంటాయి."

"నువ్వంటావు, నీకేం బాధ?" ఇందు కోపంగా అంది. "పోయినవి నా పుస్తకాలు కదా? అయిదో,పదో కాదే రెండువేలు ఖరీదు చేసే పుస్తకాలు." దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది, ఇందు. వరదలా ప్రవహించే కన్నీళ్ళకు'కర్చీఫ్'తో అడ్డు కట్టింది. ఒక నిమిషం ఆగి మళ్ళీ అంది. "మా నాన్న నన్ను ఎంత కష్టపడి చదివిస్తున్నాడో తెలుసా?" వెక్కి వెక్కి ఏడ్చింది, ఇందు. నేను మాటలాడలేకపోయాను.

"నిజం చెప్పాలంటే, నన్ను ఈ కాలేజీలో చేర్చటం మానాన్నకి ఇష్టం లేదు తెలుసా?" ఇందు అంది. "ఇది గొప్పవాళ్ళ బిడ్డలకోసం కట్టిన కాలేజి అని, వాళ్ళ పిల్లల సోకులతో, సరదాలతో, సరితూగలేమని, ఇక్కడ వొద్దన్నారు. మనతో చదివే పిల్లలు మనకన్నా ఎక్కువ స్థాయివాళ్ళైతే బాధపడుతామట. కాని మా అమ్మే, కాలేజి దగ్గరలో వుందని పట్టు పట్టి ఇక్కడ చేర్చింది. చేరి నెలైనా కాలేదు, రెండు వేల రూపాయల పుస్తకాలు పోయాయి."

నిజమే! రెండు వేల రూపాయలంటే, దిగువ మధ్య తరగతికి చెందిన ఇందుకు తక్కువేమీకాదు. ఇందుది మా ఊరే కనుక ఇందు ఇంటి పరిస్థితుల గురించి బాగా తెలిసిన నేను, ఇందు బాధని అర్థం చేసుకోగలిగాను.

జోరుగా జరుగుతోంది, పార్టీ. మాతోటి విద్యార్థినులు 'ఐస్‌క్రీం' తింటూ గట్టిగా కబుర్లు చెప్పుకుంటూ గోలచేస్తూ ఆనందిస్తున్నారు. పుట్టినరోజు గురించి పంచ నక్షత్ర హోటల్లో పార్టీ ఇచ్చిన మాయని మెచ్చుకుంటున్నారు.

మాయ అంటే, కాలేజీలో పెద్ద క్రేజు.' చాలా చాలాకీగా సరదాగా, అందరితోనూ, మంచిగా వుండేది, మాయ.

మాయ కాలేజికే "ఫాషన్‌సెటర్" మాయ వేసుకున్న బట్టలు"మేచింగ్" సెట్లు చూసి విద్యార్థినుల కళ్ళు తిరిగేవి. అప్పటివరకు వాళ్ళు కొనని, చూడని వస్తువులు మాయ వద్దే.వుండేవి. విలాసవంతంగా రోజులు గడిపేది మాయ. రెండో సంవత్సరం చదువుతున్నా కొత్తగా చేరినవాళ్ళతో కూడా చాలా ఆప్యాయంగా,సన్నిహితంగా వుండేది. మాయ తండ్రి పెద్ద పారిశ్రామికవేత్తగాని, రాజకీయవేత్తగాని అయి వుంటారనేది విద్యార్థినుల అంచనా.

"ఊరుకోవే" ఇందుకు మరీ దగ్గరగా జరిగి అన్నాను నేను.

"ఏదో ఒకటి తిను. నీవి పుస్తకాలే పోయాయి. మొన్న సుశీలది, లక్ష్మిది, పదివేలు ఖరీదు చేసే 'సెల్‌ఫోన్'లు పోయాయి కదా. వాళ్ళేమైనా......"

"వాళ్ళ సంగతి నాకెందుకే?" ఇందు ఎదురు ప్రశ్న వేసింది.

"మళ్ళీ పుస్తకాలు కొనాలి కదా? మరిడబ్బు........"

నేనేమి అనలేదు. నిమిషాలు బరువైన అడుగులతో కదలాయి. బల్లమీద, ఇందు ఎదురుగా పెట్టిన "ఐస్‌క్రీం" కరిగి ద్రవమై కప్పుమీద నుంచి బల్లమీదకు పారింది. మాతోటి విద్యార్థినుల మాటలు తగ్గాయి.

కొందరు మాయకి 'బై' చెప్పి వెళ్ళిపోయిరు కూడా.

పుస్తకాలు పోయినందువల్ల, వెళ్ళటం ఇష్టం లేకపోయినా, తప్పదని పార్టీకి వెళ్ళిన మేము కదిలాం. మాయకి మరోసారి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్తూ వుంటే, మాయ మెడలోని తెల్లరాళ్ళ నెక్లసులో, దయనీయంగా కనబడింది, ఇందు మోము.

"పుస్తకాలు ఎలాగే..."? హోటల్ బయటకు రాగానే సణిగింది ఇందు. "పుస్తకాలకు డబ్బు..."

"సణగకే......" కొంత కోపం వచ్చింది, నాకు." పాత పుస్తకాలమ్మే చోట చూద్దాంలే." కాళ్ళు ఈడ్చుకుంటూ, ఎండలో నడిచాము. పాత పుస్తకాలమ్మే బడ్డీలన్నీ చూశాము. పుస్తకాలు దొరకలేదు.

నిరాశతో తిరిగి వస్తూ ఇందు బలవంతంవల్ల వెళ్ళాము ఆ షాపుకి. పాత పుస్తకాలమ్మే షాపులా కనబడలేదు, ఆషాపు.

పుస్తకాల పేర్లు చెప్పగానే, ఒక నిమిషం ఆలోచించింది "కౌంటర్"లో అమ్మాయి. చేతివేళ్ళతో పెదవులపై తాళంవేస్తూ ఆలోచించింది ఆ తరువాత అంది. "మీ అదృష్టం బాగుందండి. ఇప్పుడే వచ్చాయి ఆపుస్తకాలు."

పుస్తకాలు తీసి చూసింది, ఇందు. పేజీలు అటూ, ఇటూ తిరగేస్తూ గావుకేక వేసింది.

"ఏంటే..." కంగారుగా అడిగాను.

"ఇవి నా పుస్తకాలేనే..చూడు సెంటర్ పేజీలో నా పొట్టి సంతకం"

తొంగి చూసాను. అవును! అది ఇందు సంతకమే! ప్రతి పుస్తకంలోనూ, సెంటర్ పేజీలో పొట్టి సంతకం చెయ్యటం, ఇందుకి అలవాటు. పుస్తకం మీద పేరు కూడా వ్రాయని ఇందు కి అదేం అలవాటో!

సొంత పుస్తకాలనే, మరోసారి కొనుక్కోవలసిన దురదృష్టాన్ని తిట్టుకుంటూ, అడుగులు వేస్తూ వుంటే వినబడ్డాయి ఆ మాటలు. "పన్నెండు వందలు ఇస్తానన్నారుగా... వెయ్యే ఇస్తారేంటి?"

"వెయ్యే ఎక్కువ."

"అంటే......"

"ఎక్కడో కొట్టుకు వచ్చిన పుస్తకాలకు..."

"ఇది న్యాయం కాదు."

ఆగొంతు బాగా పరిచయమున్న గొంతులా తోచింది. గబగబా అటు నడిచాను.

అక్కడ కనబడింది మాయ-మాకు రోజూ కనబడే మాయ అలా లేదు, ఆమె. షోకు చేసుకోని మాయ! నలిగిపోయిన సాధారణ దుస్తులు ధరించిన మాయ!

ఇందుని, నన్ను చూసిన మాయ మోము రక్తహీనంగా మారింది. నేరం రుజువైనాక, తీర్పుకోసం ఎదురు చూస్తూ బోనులో నిలబడిన ముద్దాయిలా కనబడింది ఆమె.

"అదేమిటే... ఆ పుస్తకాలు...."

"నేనే తీసాను." మాయ జంకులేకుండా, అంది. "ఆ పుస్తకాలే కావు డబ్బు..... "సెల్‌ఫోన్"లు..."

"నీకెందుకే, ఇలాంటి పనులు...గొప్పింటి పిల్లవు...."

"అలా కనబడటానికేనే ఇవి. గొప్పింటి పిల్లలతో సమానంగా కనబడాలని, వాళ్ళ వద్ద నుంచి, నాలుగు పార్టీలు పుచ్చుకుంటే ఒకటైనా ఇవ్వాలని..."

"అయితే నీవు .....

మాయ తలదించుకుంది.

లోగుట్టు పెరుమాళ్ళ కెరుక!